సాక్షి
కుమురం భీం

శనివారం । 4 । మే । 2024



ట్రిపుల్‌ఐటీ నోటిఫికేషన్ ఎప్పుడో?

ఏప్రిల్ 30న పదో తరగతి ఫలితాలు విడుదలయ్యాయి. అయినా బాసర ట్రిపుల్‌ఐటీలో అడ్మిషన్ల స్వీకరణకు ఇప్పటివరకు నోటిఫికేషన్ వెలువడలేదు. IIలో▸



గొర్రెల పంపిణీ లేనట్టేనా..?

గొర్రెల పంపిణీ పథకంపై నీలినీడలు అలుముకున్నాయి. రెండో విడత కోసం డీడీలు కట్టిన లబ్ధిదారులు తమ డబ్బు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. IIIలో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
43.7 /26.6

జిల్లాలోని పలు ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉదయం నుంచే వేడి అధికంగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

5న బీఆర్ఎస్ బహిరంగ సభ



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ దండే విఠల్

పెంచికల్‌పేట్(సిర్పూర్): పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 5న పెంచికల్‌పేట్ మండల కేంద్రంలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్సీ దండే విఠల్ తెలిపారు. మండల కేంద్రంలో బహిరంగ సభాస్థలిని శుక్రవారం స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దహెగాం, పెంచికల్‌పేట్ మండలాల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ సభకు ఆదిలాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నేతలు ముందుకు సాగాలని సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను క్షేత్రస్థాయిలో ప్రతీ గడపకు తీసుకెళ్లాలన్నారు. ఆయన వెంట నాయకులు బిట్టి శ్రీనివాస్, నగునూరి శ్రీనివాస్, రాచకొండ కృష్ణ, శంకర్‌గౌడ్, కొల్లిపాక శ్రీనివాస్, మహేశ్, తిరుపతి, శేఖర్ తదితరులు ఉన్నారు.

అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్‌రూరల్: అందివచ్చిన అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్(జీజేఎల్‌ఏ) రాష్ట్ర కోశాధికారి శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని చైతన్య కళాశాలలో శుక్రవారం జీజేఎల్‌ఏ, ఇంపాక్ట్ సంస్థ ఆధ్వర్యంలో ఇంటర్ పూర్తయిన విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఎంఎస్ఎన్ లాబొరేటరీస్ సంస్థలో ఉద్యోగాల కల్పనతోపాటు డిగ్రీ ప్రవేశాలపై జీజేఎల్‌ఏ జిల్లా అధ్యక్షుడు నవీన్‌రెడ్డి అధ్యక్షతన అవగాహన కల్పించారు. 80 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించగా.. 14 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్ ఉషారాణి, ఇంపాక్ట్ సంస్థ ప్రతినిధులు వెంకటేశ్వర్లు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

షేడ్‌నెట్స్ ఏర్పాటు చేయాలి



ఖైరిగాం నర్సరీని పరిశీలిస్తున్న డీపీవో

రెబ్బెన(ఆసిఫాబాద్): ఎండల తీవ్రతతో నర్సరీల్లోని మొక్కలు చనిపోకుండా షేడ్‌నెట్స్ ఏర్పాటు చేయాలని డీపీవో భిక్షపతి అన్నారు. మండలంలోని ఖైరిగాం, కొండపల్లి, ఇందిరానగర్, రెబ్బెన గ్రామ పంచాయతీలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా పంచాయతీల్లోని నర్సరీలు, పల్లె ప్రగతి పనులను పరిశీలించారు. ఉపాధిహామీ కూలీల సంఖ్య పెంచాలన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి ఇబ్బందులకు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. చేతి పంపులు, బోర్లు చెడిపోతే వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. మొదటిసారిగా మండలానికి వచ్చిన ఆయనను పంచాయతీ కార్యదర్శులు శాలువాతో సన్మానించారు. ఎంపీడీవో శంకరమ్మ, ఎంపీవో రాజేశ్వర్‌గౌడ్, ఏపీవో రామ్మోహన్ పాల్గొన్నారు.

'సంకల్ప సభ' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు

కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ పట్టణంలోని ఎస్పీఎం మైదానంలో ఆదివారం నిర్వహించే వికాస సంకల్ప సభ పోస్టర్‌ను శుక్రవారం కాగజ్‌నగర్‌లో ఆదిలాబాద్, సిర్పూర్ ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, పాల్వాయి హరీశ్‌బాబు ఆవిష్కరించారు. స్థానిక సంతోష్ ఫంక్షన్ హాల్‌లో వికాస సంకల్ప సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 5న వికాస సంకల్ప సభకు కేంద్రహోం మంత్రి అమిత్‌షా హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ కుమురంభీం, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనివాస్, అంజుకుమార్ రెడ్డి, బ్రహ్మానందం, ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి శ్రీనివాస్, కన్వీనర్ భూమయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొంగ సత్యనారాయణ, కిరణ్, వీరభద్రచారి, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'సరిహద్దు'లో సందిగ్ధం!



రెండు రాష్ట్రాల ఓటరుకార్డులు చూపుతున్న పరమేశ్వర్



ఒకచోట మాత్రమే ఓటు వేయాలని అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

- 'ఒక ఓటరు.. ఒక ఓటు' నిబంధనతో అయోమయం
- ఇటీవల మహారాష్ట్ర ఎన్నికల్లో ఓటేసిన సరిహద్దు గ్రామాల ఓటర్లు
- ఈ నెల 13న ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానానికి ఎన్నికలు
- ఇక్కడ కూడా ఓటు వేసేందుకు అవకాశం కల్పించాలని విన్నపం

కెరమెరి(ఆసిఫాబాద్): 'ఒక ఓటరు.. ఒక ఓటు' నిబంధన తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులోని ఓటర్లను సందిగ్ధంలోకి నెట్టింది. ఇప్పటికే ఈ నిబంధన అమల్లో ఉన్నా.. తెలంగాణ ఎన్నికల అధికారులు పార్లమెంట్ ఎన్నికల్లో దీనిని కఠినంగా అమలు చేసేందుకు చర్యలు చేపట్టడంపై కెరమెరి మండలంలోని 15 గ్రామాల ఓటర్లు అభ్యంతరం తెలుపుతున్నారు. ఓటర్లు ఒకే చోట తమ ఓటుహక్కు వినియోగించుకోవాలని అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ఆయా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. అయినా అనేక మంది ఏప్రిల్ 19న మహారాష్ట్రలో జరిగిన ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకున్నారు.

ఓటర్ల వివరాలు (తెలంగాణ ప్రభుత్వ లెక్కల ప్రకారం)

పోలింగ్ కేంద్రం	పురుషులు	మహిళలు	మొత్తం
పరంధోళి	463	387	850
ముకదంగూడ	367	347	714
భోలాపటార్	406	400	806
గౌరీ	97	80	177
అంతాపూర్	430	380	810

ఇదీ పరిస్థితి..

కెరమెరి మండలంలోని ఐదు పోలింగ్ కేంద్రాలు తెలంగాణ, మహారాష్ట్ర పరిధిలో ఉన్నాయి. ఇక్కడ సుమారు 15 గ్రామాలు మహారాష్ట్రలోని రాజురా నియోజకవర్గంలోని చంద్రపూర్ సెగ్మెంట్‌లోకి వస్తాయి. తెలంగాణలో మాత్రం ఆదిలాబాద్ పార్లమెంటరీ పరిధిలోని ఆసిఫాబాద్ నియోజకవర్గం కిందికి వస్తాయి. ఏప్రిల్ 19న జరిగిన మహారాష్ట్ర ఎన్నికల్లో ఆయా గ్రామాలకు చెందిన ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకున్నారు. 60 శాతం పోలింగ్ నమోదైందని అధికారులు వెల్లడించారు. మహారాష్ట్ర ప్రభుత్వం తెలిపిన లెక్కల ప్రకారం.. పరంధోళి పోలింగ్ కేంద్రం పరిధిలో 1,216 ఓటర్లు ఉండగా 646 మంది ఓటుహక్కు వినియోగించుకోగా.. భోలాపటార్ పోలింగ్ కేంద్రం పరిధిలో 848 మందికి 523 మంది, అంతాపూర్‌లో 470 మందికి 103 మంది, మహరాజ్‌గూడలో 328 మందికి 218 మంది ఓటు వేశారు.

సమస్యలతో సహవాసం

తెలంగాణ, మహారాష్ట్ర ప్రభుత్వాల పాలనలో కొనసాగుతున్న సరిహద్దు గ్రామాల్లో సమస్యలు పేరుకుపోయాయి. ఏళ్లుగా ఇరు ప్రభుత్వాలతో వారు పోరాడుతున్నా పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఇద్దరేసి ప్రజాప్రతినిధులు ఉన్నా ఇప్పటికీ స్థానికులకు పక్కా గృహాలు మంజూరు కాలేదు. మిషన్ భగీరథ పథకం నిర్వహణ సక్రమంగా లేక తాగునీటికి సైతం ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

ఇక్కడ ఓటేయ్యనిస్తారా..?

సరిహద్దున ఉన్న వివాదాస్పద గ్రామాల్లో ఈ నెల 13న పోలింగ్ నిర్వహణ కోసం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పిస్తున్నారు. ఐదు పోలింగ్ కేంద్రాల పరిధిలో పరంధోళి, తాండ, కోటా, శంకర్‌లొద్ది, లెండిజాల, ముకదంగూడ ,మహరాజ్‌గూడ, భోలాపటార్, గౌరి, లేండిగూడ, నారాయణగూడ, ఏసాపూర్, పద్మావతి, ఇంద్రానగర్, అంతాపూర్ గ్రామాలు ఉన్నాయి. ఇక్కడ ఐదు వేలకు పైగా జనాభా ఉండగా.. 3,357 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో చాలామంది చంద్రపూర్ నియోజకవర్గ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకున్న నేపథ్యంలో ఇక్కడి ఎన్నికల్లో ఓటు వేసేందుకు అనుమతిస్తారా.. అన్నది అనుమానంగా మారింది. ప్రతీసారి రెండు రాష్ట్రాల పరిధిలో ఓటు వేస్తున్నామని.. ఈసారి నిబంధనల పేరుతో అడ్డుకోవడం సరికాదని స్థానికులు పేర్కొంటున్నారు. స్థానికంగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో ఓటు తప్పనిసరిగా వేస్తామని వారు స్పష్టం చేస్తున్నారు. మరోవైపు 'మహా' ఎన్నికల్లో ఓటు వేసిన గుర్తించడం కూడా అధికారులకు కష్టంగా మారింది.



మహారాష్ట్ర ఎన్నికల్లో ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న పరంధోళి ఓటర్లు(ఫైల్)

జాబితాలో పేరుంటే ఓటు వేస్తాం



మాకు రెండు ప్రభుత్వాలు ఓటరు కార్డులు జారీ చేశాయి. ఏప్రిల్ 19న జరిగిన మహారాష్ట్ర ఎన్నికల్లో ఓటు వేశాం. ఇక్కడ జాబితాలో పేరుంటే కచ్చితంగా ఈ నెల 13న సైతం ఓటుహక్కు వినియోగించుకుంటాం. ఓటు వేయొద్దంటే గ్రామాలకు అసలు ఈవీఎంలే తీసుకురావొద్దు. ఒకేవైపు ఓటు వేయాలంటే రెండు కార్డులు ఎందుకు మంజూరు చేశారు.

– పతంగే లింబాదాస్, మాజీ సర్పంచ్, ముకదంగూడ

ఎమ్మెల్సీ దండే విఠల్ | ఎన్నిక చెల్లదు

- హైకోర్టు సంచలన తీర్పు.. రూ.50వేల జరిమానా కూడా
- సారంగాపూర్ జెడ్పీటీసీ పత్తిరెడ్డి పిటిషన్‌పై న్యాయస్థానం విచారణ
- అప్పట్లో ఎన్నిక బరిలో నిలిచేందుకు రాజేశ్వర్‌రెడ్డి నామినేషన్
- ఫోర్జరీ సంతకాలతో ఉపసంహరింపజేశారని కోర్టును ఆశ్రయించిన వైనం



పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి

సాక్షి, ఆదిలాబాద్: ఆదిలాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ దండే విఠల్ ఎన్నిక చెల్లదంటూ హైకోర్టు శుక్రవారం సంచలన తీర్పు వెల్లడించింది. అంతే కాకుండా రూ.50వేల జరిమానా కూడా విధించింది. నిర్మల్ జిల్లా సారంగాపూర్ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి గతంలో దండే విఠల్ ఎన్నికపై హై కోర్టును ఆశ్రయించాడు. ఈ ఎన్నికల్లో తాను పోటీ చేసేందుకు నామినేషన్ వేసినప్పటికీ, తన ప్రమేయం లేకుండానే ఫోర్జరీ సంతకాలతో నామినేషన్ ఉపసంహరించారని, ఎన్నికల అధికారులు సైతం తన నామినేషన్ ఉపసంహరించుకున్నట్లు ప్రకటించారని పత్తిరెడ్డి అప్పట్లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. వాదోపవాదాలు పూర్తయిన తర్వాత న్యాయస్థానం ఈ తీర్పు వెల్లడించింది.

వివాదం ఇలా..

ఆదిలాబాద్ స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి 2021 డిసెంబర్‌లో ఎన్నికలు నిర్వహించారు. అప్పట్లో 24 మంది అభ్యర్థులు ఈ ఎన్నిక కోసం నామినేషన్లు దాఖలు చేశారు. అప్పటి బీఆర్ఎస్ అభ్యర్థిగా దండే విఠల్ బరిలో నిలవగా, అదే పార్టీకి చెందిన నిర్మల్ జిల్లా సారంగాపూర్ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి కూడా పార్టీ ఆదేశాలు ధిక్కరించి నామినేషన్ వేశాడు. పోటీ అభ్యర్థులను నామినేషన్ల ఉపసంహరణ ద్వారా దండే విఠల్ ఎన్నిక ఏకగ్రీవం చేయాలని అప్పట్లో పార్టీ పరంగా ప్రయత్నాలు జరిగాయి. ఉపసంహరణ ప్రక్రియ రోజు 22 మంది తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. బీఆర్ఎస్ అభ్యర్థి దండే విఠల్, తుడుందెబ్బకు చెందిన పెందూర్ పుష్పరాణి స్వతంత్ర అభ్యర్థి నామినేషన్లు మాత్రమే మిగిలినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. పోలింగ్ తర్వాత ఫలితాల్లో దండే విఠల్ భారీ ఆధిక్యంతో గెలిచి స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నికయ్యాడు. అయితే పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి ఈ ఎన్నికపై హైకోర్టును ఆశ్రయించాడు. తాను నామినేషన్ ఉపసంహరించుకున్నట్టు ఫోర్జరీ పత్రాలు సృష్టించినట్లు పిటిషన్ వేశాడు. దీనిపై విచారణ కొనసాగుతూ వచ్చింది. నామినేషన్ ఉపసంహరణ పత్రంపై సంతకాలు తనవి కాదని పత్తిరెడ్డి పిటిషన్‌లో పేర్కొన్నాడు. ఈ నేపథ్యంలో ఆ పత్రాలను మధ్యలో ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపాలని హైకోర్టు అప్పట్లో ఆదేశించింది. ఆ సంతకాలను పోల్చి నివేదిక ఇవ్వాలని పేర్కొంది. రామంతాపూర్ సీఎఫ్ఎస్ఎల్‌కు పత్రాలు పంపాలని రిజిస్ట్రార్‌ను హైకోర్టు ఆదేశించింది. ఆ పత్రాలపై సంతకాలు ఫోరెన్సిక్ ల్యాబ్‌లో పోల్చి నివేదిక ఇవ్వాలని పేర్కొంది. వీటన్నింటి పరిశీలన తర్వాత తాజాగా ఈ తీర్పు వెల్లడించింది.

మారిన రాజకీయ పరిస్థితులు..

అప్పటికి ఇప్పటికీ రాజకీయ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగినప్పుడు బీఆర్ఎస్ రాష్ట్రంలో అధికారంలో ఉండగా, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అంతా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే ప్రాతినిధ్యం వహించారు. అప్పుడు బీఆర్ఎస్ అభ్యర్థిగా దండే విఠల్‌ను ప్రకటించినప్పటికీ పార్టీ ఆదేశాలు ధిక్కరిస్తూ ఇదే పార్టీలో ఉన్న సారంగాపూర్ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి కూడా నామినేషన్ వేశాడు. ఉపసంహరణ విషయంలో అప్పుడు మంత్రిగా ఉన్న ఇంద్రకరణ్ రెడ్డి తీవ్ర ప్రయత్నాలు చేశారు. అయినప్పటికీ పత్తిరెడ్డి దిగిరాలేదు. ఇదిలా ఉంటే ఆ రోజు 24 మందిలో 22 మంది నామినేషన్ ఉపసంహరించుకున్నారని ఎన్నికల అధికారులు ప్రకటించారు. అందులో పత్తిరెడ్డి కూడా ఉన్నట్టు కూడా తెలిపారు. అయితే తన ప్రమేయం లేకుండానే ఫోర్జరీ సంతకాలతో తన నామినేషన్‌ను బీఆర్ఎస్ నేతలు ఉపసంహరింపజేశారని ఆయన ఆరోపించాడు. దీనిపై హైకోర్టును ఆశ్రయించాడు. తాజాగా తీర్పు వెలువడింది. కాగా ప్రస్తుతం మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి ఇద్దరూ కాంగ్రెస్‌లోనే ఉండటం గమనార్హం.

సుప్రీం కోర్టుకు వెళ్తా..

- ఎమ్మెల్సీ దండే విఠల్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దండే విఠల్

కౌటాల/చింతలమానెపల్లి: ఉమ్మడి ఆదిలాబాద్ స్థానిక సంస్థల ఎన్నికల్లో తన ఎన్నిక చెల్లదని హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీం కోర్టుకు వెళ్తానని ఎమ్మెల్సీ దండే విఠల్ తెలిపారు. హైకోర్టు తీర్పుపై శుక్రవారం చింతలమానెపల్లి మండలం బాలజీఅనుకోడ గ్రామంలో స్పందించారు. హైకోర్టు తీర్పు తనను విస్మయానికి గురి చేసిందన్నారు. కేసు నమోదు చేసిన వ్యక్తి నామినేషన్ ఉపసంహరణలో తన ప్రమేయం లేదని స్పష్టం చేశారు. తీర్పుపై అప్పీల్‌కు వెళ్లేందుకు హైకోర్టు తనకు నాలుగు వారాల గడువు ఇచ్చిందని తెలిపారు. సుప్రీం కోర్టులో తనకు సంపూర్ణ న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

జిల్లాలను కుదిస్తే ఊరుకోం

- కుమురంభీం స్ఫూర్తితో ఉద్యమిస్తాం
- ఎమ్మెల్యే కోవ లక్ష్మి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌అర్బన్: కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో జిల్లాల కుదింపు చర్యలకు పాల్పడితే ఊరుకోమని ఎమ్మెల్యే కోవ లక్ష్మి హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆరు అబద్ధపు గ్యారంటీలతో గద్దెనెక్కిన సీఎం రేవంత్ రెడ్డి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాలను కుదించే యోచనలో ప్రభుత్వం ఉందని ఆరోపించారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాను రద్దు చేస్తే ఆదివాసీ యోధుడు కుమురంభీం స్ఫూర్తితో మరో పోరాటానికి సిద్ధమని స్పష్టం చేశారు. ప్రత్యేక జిల్లా ఏర్పాటు తర్వాత ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. జిల్లాను తొలగిస్తే అభివృద్ధి కుంటుపడి ఆదివాసీలు అవస్థలు పడే అవకాశం ఉందన్నారు. కుమురంభీం ప్రాజెక్టు నిర్మాణం కాంగ్రెస్ హయాంలోనే జరిగిందని, నాణ్యత లోపానికి ఆ పార్టీయే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కాలువలు పూర్తి కాకముందే అప్పటి సీఎం కిరణ్‌కుమార్ రెడ్డి ప్రాజెక్టును ప్రారంభించారని గుర్తు చేశారు. ప్రజలను ఇబ్బంది పెడితే సహించేది లేదన్నారు. ఎన్నికల ప్రచారానికి వచ్చిన సీఎం జిల్లా ఏ హామీలు ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉంటేనే అభివృద్ధి చేస్తారా.. లేకుంటే పట్టించుకోరా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు 40వేల మెజారిటీ సాధించనున్నారని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిలువేరు వెంకన్న, నాయకులు జీవన్, తారీఖ్, హైమద్, రవికుమార్, నిసార్, రాపర్తి కార్తీక్, యాదగిరి, రవి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అమిత్‌షా సభ విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్

ఆసిఫాబాద్: కాగజ్‌నగర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించే కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా బహిరంగ సభకు నాయకులు, ప్రజలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి అలిజాపూర్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో రాష్ట్ర నాయకుడు బోనగిరి సతీశ్‌బాబు, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, బీజేపీ జిల్లా కోకన్వీనర్ మయూర్ చంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదినాథ్, రాష్ట్ర మహిళా మోర్చా నాయకురాలు సిద్దంశెట్టి సుహాసినితో కలిసి శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆదివారం ఉదయం 11 గంటలకు కాగజ్‌నగర్‌లోని ఎస్పీఎం గ్రౌండ్‌లో నిర్వహించే బహిరంగ సభలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. పదేళ్ల నరేంద్ర మోదీ పరిపాలనపై దేశ ప్రజలు అమితమైన విశ్వాసంతో ఉన్నారన్నారు. కాంగ్రెస్ 6 గ్యారంటీలు బూటకమని, ప్రజలను నయవంచన చేశారని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు, సీఎం రేవంత్‌రెడ్డికి ప్రజలు సరైన గుణపాఠం చెప్తారని పేర్కొన్నారు. రాష్ట్ర చరిత్రలో కేవలం నాలుగు నెలల్లో ఏ పార్టీ ప్రజాగ్రహానికి గురికాలేదన్నారు. బీఆర్ఎస్ మునిగిపోయే నావ అని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో పదేళ్ల బీఆర్ఎస్ నియంత పాలనను భరించలేక ఆ పార్టీకి ప్రజలు గుణపాఠం చెప్పారన్నారు. నిరాష్ట్రంలో బీజేపీ 12 స్థానాలు కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు సత్యనారాయణ, ప్రసాద్‌గౌడ్, బొమ్మెన శ్రావణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ఆరోగ్య పరీక్షలు

- రెండు జిల్లాల్లో 616 మందికి పరీక్షలు
- మెరుగైన వైద్యానికి ఏడుగురు సిఫారసు



ఆర్టీసీ ఉద్యోగులకు వైద్యపరీక్షలు చేస్తున్న సిబ్బంది

మంచిర్యాలఅర్బన్: పని ఒత్తిడి, అవిశ్రాంతితో ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది ఆందోళనకు గురవుతున్నారు. వీరి అనారోగ్య పరిస్థితులను గమనించిన ఆర్టీసీ యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించింది. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలంటే వారందరూ ఆరోగ్యంగా ఉండాలని భావించింది. టీఎస్ ఆర్టీసీ గ్రాండ్ హెల్త్ చాలెంజ్‌లో భాగంగా మంచిర్యాల డిపోలో ఏప్రిల్ 18నుంచి 25వరకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మధుమేహం, రక్తపోటు, ఈసీజీ, కంటిపరీక్షలు, గుండె తదితర 17రకాల పరీక్షలు చేశారు. మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో 647మంది ఉద్యోగులు, సిబ్బందిలో 616మందికి పరీక్షలు నిర్వహించారు. వీరిలో గుండె సంబంధిత వ్యాధులు, ఇతర జబ్బులతో బాధపడుతున్న ఏడుగురు కార్మికులకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్, కరీంనగర్ ప్రాంతాలకు రెఫర్ చేశారు.

పని ఒత్తిడిలో..

నిత్యం పని ఒత్తిడిలో ఉండడంతో ఆరోగ్యంపై శ్రద్ధ తగ్గిపోయే అవకాశాలున్న నేపథ్యంలో డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బందికి పరీక్షలు నిర్వహించింది. బస్సు నడిపే ప్రతీ డ్రైవర్‌కు గంట తర్వాత 15నిమిషాలు విశ్రాంతి ఇవ్వాలని చట్టం చెబుతోంది. కనీస సమయం, విశ్రాంతి ఇవ్వడం లేదు. ఇదివరకు స్పెషల్ ఆఫ్ నడిచే బస్సులను డే అవుట్‌గా మార్చడం వల్ల కార్మికులు నష్టపోతున్నారు. స్పెషల్ ఆఫ్ బస్సులు నడిపితే మరుసటి రోజు విశ్రాంతి ఇచ్చేవారు. ఇప్పుడు డే అవుట్‌లో కూడా అదనంగా డ్యూటీ చేసిన గంటలను సాంకేతిక కారణాలు చూపుతూ కుదిస్తున్నారు. సెలవుల పొజిషన్ లేదంటూ దాట వేస్తున్నారనే ఆరోపణలున్నాయి. కొన్ని బస్సుల్లో ఒక్క చోట బస్సు నిలపడం తర్వాత స్టీరింగ్ పట్టుకుంటే గమ్యస్థానానికి చేరడం జరుగుతుంది. కొంతమందికి విశ్రాంతి ఉన్నా చాలామందికి వెంటనే తిరుగు ప్రయాణం చేస్తున్నారు. ఇలా డ్యూటీ చేసుకుని వచ్చిన వెంటనే మళ్లీ విధులకు వెళ్తున్న సందర్భాలు అనేకం. బస్సుల్లో కూర్చునే సీట్లు అనువుగా లేకపోవడంతో అనేకమంది వెన్నునొప్పితో బాధపడుతున్నారు. ఆయా ప్రాంతాలకు ప్రయాణికులను చేరవేసి నైట్ హాల్ట్ చేసే ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు విశ్రాంతి ఎక్కడ తీసుకోవాలో అర్థంకాని ప్రశ్నే. దీంతో నిద్రలేమి, ఒత్తిడికి గురవుతూ అనారోగ్యం పాలవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రాథమిక దశలోనే డ్రైవర్లు, సిబ్బంది ఆరోగ్య వివరాలు తెలుసుకునేందుకు టీఎస్ ఆర్టీసీ గ్రాండ్ హెల్త్ చాలెంజ్ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య పరీక్షలు చేపట్టారు. తీవ్ర సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి మెరుగైన వైద్య చికిత్సలకు సిఫారసు చేశారు.

ఉద్యోగులు ఓటుహక్కు వినియోగించుకోవాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



శ్రీవేణిని సన్మానిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌అర్బన్: లోక్‌సభ ఎన్నికల్లో విధులు నిర్వర్తించే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. ఆదిలాబాద్ పార్లమెంటరీ పరిధిలోని ఆసిఫాబాద్ నియోజకవర్గంలో ఎన్నికల విధులు నిర్వర్తించే ఉద్యోగుల కోసం జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. శుక్రవారం నుంచి ప్రారంభమైన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 3 నుంచి 8 వరకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల్లోగా ఉద్యోగులు ఓటు వేయొచ్చన్నారు. ఆసిఫాబాద్‌లోని ఫెసిలిటేషన్ కేంద్రంలో మొత్తం 2,420 మంది ఉద్యోగులు ఓటు వేసేందుకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఏర్పాట్ల గురించి అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ దాసరి వేణు, ఆర్డీవో లోకేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు అభినందన

ఆసిఫాబాద్‌రూరల్: ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చూపిన జైనూర్ మండలంలోని గిరిజన ఆశ్రమ ఆశ్రమ పాఠశాల విద్యార్థులను జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అభినందించారు. గిరిజన ఆశ్రమానికి చెందిన విద్యార్థినులు శ్రీవేణి 9.7, దివ్యావాణి 9.3 జీపీఏ సాధించడం అభినందనీయమన్నారు. జిల్లాలో 37 గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పది పాఠశాలలు వందశాతం ఉత్తీర్ణత సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీటీడీవో రమాదేవి, జీసీడీవో శకుంతల, ఏసీఎం ఉద్ధవ్, ఏటీడీవో పురుషోత్తం తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

జిల్లాల తగ్గింపు వద్దు



మాట్లాడుతున్న బుర్స పోచయ్య

బెజ్జూర్: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లాలను కుదింపు చేయడం మానుకోవాలని రాష్ట్ర ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, ఆదివాసీ కోలవార్ సేవా సంఘం (మన్నేర్ వార్లు) రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పోచయ్య కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో కుమురంభీం విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను నాలుగు జిల్లాలుగా చేసిన తర్వాత మళ్లీ కుదింపు నిర్ణయం సరికాదని పేర్కొన్నారు. ఆదివాసీ కోలవార్ సేవా సంఘం బెజ్జూర్ మండలాధ్యక్షుడు పెద్దల శంకర్, ఆదివాసీ నాయకులు తుమ్మిడే అశోక్, తలండి భిక్షపతి, డబ్బ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

10న జిల్లాస్థాయి చెస్ పోటీలు

మందమర్రిరూరల్: ఈ నెల 10న మందమర్రి పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో జిల్లాస్థాయి చెస్‌పోటీలు నిర్వహించనున్నట్లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చదరంగం ఆట అభివృద్ధి కమిటీ చైర్మన్ ఈగ కనుకయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్‌ఆర్‌ఆర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీలకు ప్రతీ గ్రూపునకు ఇద్దరు చొప్పున జిల్లా జట్టుకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాస్థాయిలో ఎంపికైన వారు హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

‘ఉద్యోగాల కల్పనలో బీజేపీ విఫలం’



జెండా ఆవిష్కరిస్తున్న రవి

పాతమంచిర్యాల: బీజేపీ ప్రభుత్వం పదేళ్లుగా అధికారంలో ఉండి యువతకు ఉద్యోగాలు కల్పించడంలో విఫలమైందని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి లింగం రవి ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం అఖిల భారత యువజన సమాఖ్య ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన యువతకు ఓటు హక్కు కల్పించిన ఘనత ఏఐవైఎఫ్‌దేనని చెప్పారు. విద్య, వైద్యం, ఉపాధి హక్కుల కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. హక్కులు కాపాడుకోవడానికి యువజన సమాఖ్య పోరాటాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొంకుల రాజేశ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మొగిలి లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు మామిడాల సత్తయ్య తదితరులున్నారు.

నేడు ఓటరు చైతన్యంపై 5కే రన్

మంచిర్యాలఅగ్రికల్చర్: ఓటరు చైతన్యంపై శనివారం ఉదయం 5గంటలకు మంచిర్యాలలోని ఐబీ చౌరస్తా నుంచి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వరకు 5కే రన్ నిర్వహించనున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి కిషన్ ఒక ప్రకటనలో తెలిపారు. పార్లమెంటు సాధారణ ఎన్నికల్లో భాగంగా రన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బాసర దేవస్థానం ఉద్యోగ సంఘం కార్యవర్గం

భైంసా: బాసర దేవస్థానం ఉద్యోగ సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నికైంది. దేవస్థానం పరిపాలన సిబ్బంది, వైదిక సిబ్బంది, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, వాగ్దేవి సొసైటీ హోంగార్డు సిబ్బంది అంతా సమష్టిగా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా ప్రవీణ్‌పాఠక్ (స్థానాచార్యుడు), అధ్యక్షుడిగా సంజీవ్‌పూజారి (ప్రధాన అర్చకుడు), ఉపాధ్యక్షులుగా మధన్‌దీక్షిత్, ముఖ్య అర్చక కార్యదర్శిగా డీ విలాస్, సంయుక్త కార్యదర్శులుగా ఎస్ రాజేందర్, సీహెచ్ రాజేందర్, కోశాధికారులుగా శివరాజ్, చంద్రమోహన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ట్రిపుల్‌ఐటీ నోటిఫికేషన్ ఎప్పుడో?



బాసర ట్రిపుల్‌ఐటీ కళాశాల

- ఏప్రిల్ 30న ఎస్సెస్సీ ఫలితాలు వెల్లడి
- ఏటేటా అడ్మిషన్ల స్వీకరణలో జాప్యం
- నిరీక్షిస్తున్న ‘పది’ ఉత్తీర్ణులైన విద్యార్థులు
- ఈసారి జూన్ 15లోపు పూర్తి చేసేనా?

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి ఇప్పటివరకు అడ్మిషన్ల స్వీకరణకు నోటిఫికేషన్ వెలువడలేదు. ఏప్రిల్ 30న పదో తరగతి ఫలితాలు విడుదలయ్యాయి. మంచి జీపీఏ సాధించిన విద్యార్థులంతా ఎక్కడ చదవాలనే ఆలోచనలో పడ్డారు. ప్రధానంగా రాష్ట్రంలోని ఏకైక బాసర ట్రిపుల్‌ఐటీలో చదవాలని ఆసక్తి చూపేవారి సంఖ్యే ఎక్కువ. ఇక్కడే చదివించాలని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న తల్లిదండ్రులూ ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 10జీపీఏ సాధించిన విద్యార్థులంతా ఎప్పుడు నోటిఫికేషన్ వచ్చినా దరఖాస్తు చేసుకునేందుకు ఎదురుచూస్తున్నారు. కానీ, ఇప్పటివరకు ట్రిపుల్ ఐటీ యాజమాన్యం నోటిఫికేషన్ వెలువరించలేదు. ఏటా నోటిఫికేషన్ వెలువడడం, అడ్మిషన్ల ప్రక్రియ పూర్తవడం ఆలస్యమవుతూనే ఉంది.

ఏటా 30వేలకు పైనే దరఖాస్తులు

ఏటా అడ్మిషన్ల స్వీకరణకు ఆలస్యం జరుగుతుండడంతో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఇతర కోర్సుల్లో చేరుతున్నారు. నిర్దిష్ట పరిమితిలో ఉన్న సీట్లు భర్తీ కావడంతో ఇక్కడే సీటు దక్కుతుందన్న ఆశతో నిరీక్షించే విద్యార్థులకు ఇంటర్ తత్సమాన కోర్సుల్లో మంచి కాలేజీల్లో చదువుకునే అవకాశం దక్కడంలేదు. ఏటా ఆగస్టు, సెప్టెంబర్ వరకు ఈ ప్రక్రి య కొనసాగుతుంది. ట్రిపుల్ ఐటీలో ప్రవేశానికి ఏ టా 30వేల నుంచి 35వేల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇక్కడ వెయ్యి నుంచి 1,500 సీట్లు మాత్రమే ఉన్నాయి. సీటు దక్కని వి ద్యార్థులు ఇతర కోర్సుల్లో చేరుతున్నారు. కానీ.. మెరిట్ జాబితా వెలువడకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు నిరీక్షిస్తున్నారు. ఎలాగైనా తమ పిల్లలకు ట్రిపుల్ ఐటీలోనే సీట్లు దక్కుతాయని ఆశగా ఎదురుచూస్తున్నారు. పోటీ పెరగడంతో ట్రిపుల్‌ఐటీలో సీటు రాక రాష్ట్రంలో పేరున్న కళాశాలల్లో చదువుకునే అవకాశంలేక ఏదో ఒక చోట అడ్మిషన్ తీసుకుని చదువుకుంటున్నారు. పదో తరగతి పరీక్ష ఫలితాలు వెలువడిన మరుసటిరోజే ట్రిపుల్‌ఐటీ అ ధికారులు ప్రవేశాల నోటిఫికేషన్ వెలువరించాలి. ద రఖాస్తు చేసుకున్న 15 రోజుల్లోనే జాబితా వెలువరి స్తే మిగతా విద్యార్థులు తమకు సీటు రాలేదని మ రో కోర్సులో చేరేందుకు అవకాశం ఉంటుంది. కా నీ.. ఏటా ఇక్కడి అధికారులు విద్యాసంవత్సరంలో అడ్మిషన్ల ప్రక్రియను కొంత ఆలస్యం చేస్తున్నారు.

ఏర్పాటు కాని కమిటీ

బాసర ట్రిపుల్‌ఐటీలో 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి విద్యార్థుల ప్రవేశాల కోసం అడ్మిషన్ కమిటీ ఇప్పటివరకు ఏర్పాటు కానట్లు సమాచారం. గతేడాది ఉన్న కమిటీనే కొనసాగిస్తారా? లేదా కొత్త కమిటీ వేస్తారా? అనే విషయంపై స్పష్టత రావడంలేదు. ఏప్రిల్ 30న పదో తరగతి పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. అయితే ఈసారి 1,500 సీట్లు ఉంటాయో.. వెయ్యి సీట్లకు కుదిస్తారో.. అనే విషయం తెలియడంలేదు. 2008లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ట్రిపుల్ ఐటీని ప్రారంభించారు. 2008లో 2వేల సీట్లతో ట్రిపుల్‌ఐటీ కళాశాల ప్రారంభమైంది. రెండేళ్లకే ఉమ్మడి రాష్ట్రంలో ఈ సీట్లు సగానికి తగ్గించి వెయ్యి మందికి అడ్మిషన్లు ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక వెయ్యి సీట్లతోనే అడ్మిషన్లు తీసుకున్నారు. 2018లో మరో 500 పెంచి అప్పటి నుంచి ఏటా 1,500 సీట్లు కేటాయించారు. మళ్లీ ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కొత్త ప్రభుత్వం 1,500 సీట్లను కొనసాగిస్తుందా.. మళ్లీ వెయ్యి సీట్లకే కుదిస్తుందా.. లేక ప్రారంభంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి లాగా 2,000 సీట్లకు పెంచుతుందా? అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది.

గ్రామీణ విద్యార్థులకే ప్రాధాన్యం!

2024–25 విద్యాసంవత్సరంపై ప్రభుత్వం దృష్టి సారించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విద్యాసంవత్సరంలోనైనా ట్రిపుల్ ఐటీ కళాశాలలో పరిస్థితి మెరుగుపడాలని ఆశిస్తున్నారు. ఏటా విద్యార్థులు ఎన్నో ఆశలతో ట్రిపుల్‌ఐటీలో అడుగుపెడుతున్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులకే ట్రిపుల్‌ఐటీలో అత్యధిక సీట్లు దక్కుతున్నాయి. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన విద్యార్థుల ఆలోచనలకు అనుగుణంగా పీయూసీ–1 విద్యాభ్యాసం, హాస్టల్ వాతావరణం ఉండేలా చూడాలని విద్యారంగ నిపుణులు చెబుతున్నారు. ఎంతో ఆశగా వస్తున్న విద్యార్థులు ట్రిపుల్‌ఐటీలో ఉన్న పరిస్థితులను చూసి భయాందోళనలకు గురవుతున్నారని పేర్కొన్నారు. ప్రవేశాల సమయంలోనే ప్రభుత్వం కొత్త విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి సమావేశాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. వారి ఆలోచనలకు తగ్గట్లు పీయూసీ–1, పీయూసీ–2 చదువులు పూర్తయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు. రెండేళ్ల పీయూసీ, మరో నాలుగేళ్ల ఇంజినీరింగ్ కోర్సుల్లో ఇక్కడ బోధిస్తారు. కళాశాల ప్రారంభంలోనే ప్రభుత్వం దృష్టిసారించి వారి ఆలోచనలకు తగ్గట్లుగా అడుగులు వేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

విధుల్లో లేకున్నా ఎన్నికల విధులు

- పీటీఐల అభ్యంతరం
- రద్దు లేదా రీఎంగేజ్‌కు డిమాండ్

కాసిపేట: విధుల్లో లేకున్నా ఎన్నికల విధులు కేటాయింపుపై టెర్మినేట్‌లో ఉన్న పీటీఐ(పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్)లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. విద్యాశాఖలోని సమగ్ర శిక్ష అభియాన్‌లో పీటీఐలను ఏటా విద్యాసంవత్సరం చివరి రోజు తొలగించి విద్యాసంవత్సరం ప్రారంభమయ్యాక మళ్లీ విధుల్లోకి తీసుకుంటారు. పాఠశాలల్లో పీఈటీ, ఆర్ట్, క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్లుగా సేవలు అందించే వీరు పేరుకు పార్ట్‌టైం అయినా అధికారుల ఆదేశాలతో పూర్తి సమయం విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులు సెలవు, సమావేశాలకు వెళ్లిన సమయంలో సైతం సర్దుబాటు చేస్తుంటారు. ఎన్నికల విధులు, పదవ తరగతి పేపర్ వాల్యూయేషన్(స్పాట్), కొన్ని పరీక్షలకు ఇన్విజిలేటర్లుగా వేస్తుంటారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 254మంది పీటీఐలు, రాష్ట్ర వ్యాప్తంగా



విద్యార్థులకు డ్రాయింగ్ నేర్పిస్తున్న పీటీఐ (ఫైల్)

సుమారు 2,300 మంది పీటీఐలుగా పాఠశాలల్లో పని చేస్తున్నారు. పది నెలలు పని, రూ.11,700 వేతనంతో బతుకులు వెల్లదీస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో విధులు నిర్వర్తించడంతో ప్రస్తుతం సంబంధిత అధికారులు ఎన్నికల విధులకు వీరి జాబితా సైతం పంపించారు. దీంతో వారికి ఎన్నికల విధులు కేటాయించారు. వేసవి సెలవులు కావడంతో టెర్మినేట్‌లో ఉన్న తాము ఎన్నికల విధులు ఎలా నిర్వర్తిస్తామని, తమ విధులను రద్దు చేయాలని, లేనిపక్షంలో రీ ఎంగేజ్ చేయాలని ఎన్నికల సంఘానికి విన్నవించారు. దీంతో విధుల్లోకి తీసుకోవాలని ఎన్నికల సంఘం విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీని ఆదేశించింది. కిందిస్థాయి అధికారుల వివరణ కోరారు. 20 రోజులు గడుస్తున్నా అధికారుల నుంచి ఎలాంటి సమాచారం లేదు. దీంతో మరోసారి ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించగా.. మరోమారు చెప్పడం తప్పితే తమ చేతుల్లో ఏమీ లేదనడంతో ఎన్నికల విధులకు దూరంగా ఉంటామని పీటీఐలు ప్రకటిస్తున్నారు. శిక్షణకు హాజరు కావాలని, డ్యూటీ ఆర్డర్ కాపీలు తీసుకోవాలని కింది స్థాయి అధికారులు ఒత్తిడి తెస్తున్నారు. ఈ క్రమంలో ఎటూ తేల్చుకోలేక పోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రీఎంగేజ్ చేయడమో, ఎన్నికల విధులు రద్దు చేయడమో చేయాలని కోరుతున్నారు.

రవి మృతదేహం కోసం..

- కుటుంబీకులు, బంధువుల యాతన
- ఎట్టకేలకు స్వగ్రామం చేరిన మృతదేహం
- నేడు వంగరలో అంత్యక్రియలు



రెండో సోదరుడు తిరుపతితో రవి (తెల్ల చొక్కా)

ప్రజల కోసమే ప్రాణమిచ్చిండు



రవి పెద్దన్న వెంకటేశ్

16 ఏళ్ల వయస్సులో విప్లవోద్యమంలోకి వెళ్లిన నా తమ్ముడు రవి 48 ఏళ్ల వయస్సులో ఎన్‌కౌంటర్‌లో చనిపోయిండు. ముప్పై ఏళ్లకు పైగా విప్లవోద్యమంలో పనిచేసిండు. ఉద్యమంలోకి పోయిన నుంచి ఒక్కసారి కూడా ఇంటి ముఖం చూడలె. ఎప్పటికైనా క్షేమంగా ఇంటికి వస్తడనుకున్నం. గిట్ల శవమై వస్తడనుకోలె. ప్రజల కోసం పోరుబాట పట్టిండు. ప్రజల కోసమే ప్రాణమిడిసిండు. నా తమ్ముని జన్మ ధన్యమైంది’

ఇది ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో గత మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన దండకారణ్య కమిటీ సభ్యుడు కాసవేణ రవి పెద్దన్న వెంకటేశ్ కన్నీటి వేదన.

బెల్లంపల్లి: ఛత్తీస్‌గఢ్‌లో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన దండకారణ్య రాష్ట్ర కమిటీ సభ్యుడు, బెల్లంపల్లికి చెందిన కాసవేణ రవి అలియాస్ అశోక్ అలియాస్ వినయ్ (48) మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకురావడానికి కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితులు పడిన యాతన అంతా ఇంతా కాదు. మంగళవారం ఉదయం ఎన్‌కౌంటర్ జరగగా శుక్రవారం మధ్యాహ్నం 3గంటలకు రవి మృతదేహాన్ని ఛత్తీస్‌గఢ్ పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆ తర్వాత నారాయణపూర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి నుంచి మృతదేహాన్ని ఇంటికి తీసుకురావడానికి ఇబ్బందులేర్పడ్డాయి. రవి మృతదేహాన్ని తీసుకురావడానికి కుటుంబీకులు, బంధువులు, సన్నిహితులు బుధవారం మధ్యాహ్నం భీమదేవరపల్లి మండలం వంగర స్వస్థలం నుంచి ఛత్తీస్‌గఢ్‌కు బయల్దేరి వెళ్లారు. దట్టమైన అటవీ ప్రాంతం మీదుగా, పోలీసుల తనిఖీల మధ్య 12 గంటల తర్వాత అక్కడికి చేరుకున్నారు. బుధవారం ఉదయం నారాయణపూర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి వెళ్లి మార్చురీలో భద్రపర్చిన రవి మృతదేహాన్ని సోదరుడు వెంకటేశ్, బంధువులు గుర్తించి బోరున విలపించారు.

కిడ్నీ నుంచి తూటాలు..

కుటుంబ సభ్యులు రవి మృతదేహాన్ని గుర్తించగా వైద్యులు స్కాన్ చేశారు. అతడి శరీరంలోని తూటాలను పరిశీలించిన నారాయణపూర్ ప్రభుత్వాస్పత్రి వైద్యులు పోస్టుమార్టం చేయడం సాధ్యంకాదని చెప్పారు. జగ్దల్‌పూర్ నుంచి ప్రత్యేక వైద్యులను శుక్రవారం ఉదయం రప్పించి మరోసారి రవి మృతదేహాన్ని స్కాన్ చేసి చూసిన తర్వాత పోస్టుమార్టం చేశారు. కాగా, కిడ్నీని ఆనుకుని మూడు తూటాలు ఉండటంతో నిపుణులైన వైద్యులతో పోస్టుమార్టం చేయించారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని అప్పగించడంతో ప్రైవేట్ అంబులెన్స్‌లో స్వస్థలానికి చేరుకున్నారు. కాగా, శనివారం స్వగ్రామం వంగరలో రవి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు అతడి సోదరుడు వెంకటేశ్ తెలిపారు.

కాంగ్రెస్ కోఆర్డినేటర్ల నియామకం

మంచిర్యాలటౌన్: పెద్దపల్లి పార్లమెంటు ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ కమిటీ సభ్యులు, కోఆర్డినేటర్లను శుక్రవారం నియమించింది. అందులో భాగంగా ప్రధాన కమిటీ సభ్యుడిగా ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌ను నియమించగా, కోఆర్డినేటర్లుగా కేవీ.ప్రతాప్, ఆంజనేయులు పులి, ఏ.శ్రీనివాస్‌లను నియమిస్తూ టీపీసీసీ ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ కన్వీనర్ కపిలవాయ్ దిలీప్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

కలెక్టర్‌ను కలిసిన ఎస్‌ఈ



మంచిర్యాలఅగ్రికల్చర్: ఇటీవల బదిలీపై వచ్చిన టీఎస్‌ఎన్పీడీసీఎల్ జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్(ఎస్‌ఈ) ఎస్.శ్రావణ్‌కుమార్ శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ సంతోష్‌ను కలిశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేపట్టాలని, వినియోగదారులకు మంచి సేవలు అందించాలని సూచించారు.

ఆర్వో వాటర్ కొందరికేనా?



నస్పూర్ కాలనీలో కంపెనీ ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్

ప్లాంట్ పనిచేసే సమయ సూచిక

- అందడం లేదన్న కార్మిక కుటుంబాలు
- అన్ని కాలనీలకు ఇవ్వాలని డిమాండ్

శ్రీరాంపూర్: కార్మిక కుటుంబాలకు శుద్ధమైన తాగునీటిని అందించాలనే బృహత్ సంకల్పంతో కంపెనీ కాలనీల్లో ఆర్వో వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తోంది. ఇందులో భాగంగా శ్రీ రాంపూర్ డివిజన్‌లో కొన్ని నెలల కిత్రం వీటి ఏర్పాటు కు పూనుకున్నారు. శ్రీరాంపూర్ ఏరియా కంపె నీలోనే ఎక్కువ మంది కార్మికులు ఉన్నది కావడంతో ఇక్కడ కాలనీల వారీగా మొత్తం ఐదు ఆర్వో వా టర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఇందులో భాగంగా నస్పూర్ కాలనీ లోని వాటర్ ట్యాంక్ వద్ద, కృష్ణ కాలనీలోని వాటర్ ట్యాంక్ వద్ద ఆర్వో వాటర్ ప్లాంట్లను కొన్ని నెలల కిత్రమే ఏర్పాటు చేసి నీరందిస్తున్నారు. ఐతే వీటితో పాటుగా శ్రీరాంపూర్ కాలనీ, నస్పూర్ నాగార్జున కాలనీ, తాళ్లపల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో కూడా వా టర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ.. నెలలు గడుస్తున్నా వాటిని కంపెనీ ఏర్పాటు చేయడం లేదు. దీంతో కార్మిక కుటుంబాలు ఆర్వో వాటర్ లభించక ప్రైవేట్ ప్లాంట్ల నిర్వాహకుల నుంచి కొనుగోలు చేయాల్సి వస్తోంది. కొన్ని కాలనీల్లో ప్లాంట్లు ఏర్పాటు చేసి మరికొన్ని కాలనీల్లో ఏర్పాటు చేయకపోవడంపై కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసలే గోదావరి నుంచి తాగునీరు కలుషితమై వస్తోందని తెలిపారు. ఇలాంటి సమయంలోనూ ఎంతో ఆవశ్యకత ఉన్న ఆర్వో ప్లాంట్ల ఏర్పాటుపై జాప్యం చేయడం ఏమిటని వాపోతున్నారు. వెంటనే మిగతా కాలనీల్లో వీటని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఆదివారం కూడా తెరవాలి

ఈ ఆర్వో వాటర్‌ప్లాంట్‌లో కంపెనీ ఉద్యోగులకు మాత్రమే నీటిని తీసుకునే వీలుంది. వాటర్‌క్యాన్ నింపితే రూ.5 తీసుకుంటున్నారు. ఇందుకోసం ముందుగానే గనులపై ఉద్యోగులు వీటికి సంబంధించిన కూపన్లు కొనుగోలు చేసుకుని ఆ కూపన్ ఇస్తే వెంట తెచ్చుకునే క్యాన్‌లో నీటిని నింపుతారు. ఈ ప్లాంట్లు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, సాయంత్రం 3 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు తెరిచి ఉంటాయి. ‘ఆదివారం సెలవు’ అని బంద్ పెడుతున్నారు. తాగునీరు అందించే ప్లాంట్లకు సెలవు ఎందుకని కార్మిక కుటుంబాలు ప్రశ్నిస్తున్నాయి. వారంలో ఒకరోజు ప్రైవేట్ కంపెనీల వద్ద నీటిని కొనడమేమిటని వాపోతున్నారు. ఈ సమస్యపై శ్రీరాంపూర్ ఏరియా సివిల్ డీజీఎం ఆనంద్‌కుమార్‌ను వివరణ కోరగా ఈ సమస్యపై ఉన్నతాధికారులతో చర్చించి చెబుతామన్నారు.

‘అనుబంధ పరిశ్రమలు తెస్తాం’



కేక్ కట్ చేస్తున్న జనక్ ప్రసాద్

శ్రీరాంపూర్: సింగరేణిలో అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేసి ఈ ప్రాంత నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్, రాష్ట్ర మినిమం వేజెస్ బోర్డు కార్పొరేషన్ చైర్మన్ బీ జనక్‌ప్రసాద్ తెలిపారు. శ్రీరాంపూర్‌లోని పలు గనులపై యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఓపెన్ కాస్ట్‌పై జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని యూనియన్ జెండా ఆవిష్కరించారు. కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సింగరేణి కార్మిక వర్గానికి మేలు చేసే ఏకైక సంఘం తమదేనని పేర్కొన్నారు. కార్మికులకు అనేక హక్కులు, సదుపాయాలు కల్పించామని తెలిపారు. దేశంలోనే 3.47 కోట్ల సభ్యత్వం ఉన్న ఏకైక అతిపెద్ద కార్మిక సంఘం తమదేనని పేర్కొన్నారు. పవర్ ప్లాంట్లు మరిన్ని ఏర్పాటు చేయాలని కోరారు. సింగరేణిలో కొత్తగా ఐదు భూగర్భ గనులు తీసుకువస్తామని చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జట్టి శంకర్‌రావు, బ్రాంచ్ కేంద్ర కమిటీ నాయకులు భీంరావు, గరిగే స్వామి, కలవేని శ్యామ్, నాయకులు తిరుపతి రాజు, తిరుపతిరెడ్డి, అనిల్, వెంకటస్వామి, కాల్వ శ్రీనివాస్, వెంగళకుమార్ స్వామి, మహేందర్‌రెడ్డి, నీలం సదయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉంటా

మంచిర్యాలటౌన్: అసంఘటిత కార్మికుల సంక్షేమానికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని ఐఎన్టీయూసీ జాతీయ కార్యదర్శి, రాష్ట్ర కనీస వేతనాల బోర్డు చైర్మన్ బీ జనక్‌ప్రసాద్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఐఎన్టీయూసీ ఆవిర్భావ వేడుకలను జిల్లా అధ్యక్షుడు రాంశెట్టి నరేందర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికుల సమక్షంలో కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకొన్నారు. అనంతరం జనక్‌ప్రసాద్ మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేయాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు కేవీ ప్రతాప్, కాంపల్లి సమ్మయ్య, దేవి భూమయ్య, కలవేన శ్యామ్, జే నర్సింగ్, భీమ్ రవి, అబ్దుల్ రజాక్ పాల్గొన్నారు.

‘కొప్పుల’ను గెలిపిస్తే పన్ను రద్దుకు కృషి



మాట్లాడుతున్న విజయలక్ష్మి

మందమర్రిరూరల్: బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపిస్తే సింగరేణి కార్మికుల ఇన్‌కంటాక్స్ రద్దుకు కృషి చేస్తారని రాష్ట్రీయ కాలరీస్ మజ్దూర్ సంఘ్ (ఐఎన్టీయూసీ) రాష్ట్ర అధ్యక్షురాలు సోమారపు విజయలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం మందమర్రి మార్కెట్‌లో టీబీజీకేఎస్ ఆఫీస్‌లో ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపెల్లి సంపత్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి, వివేక్ తనయుడు వంశీకృష్ణను గెలిపిస్తే వారి పరిశ్రమలు కాపాడుకునేందుకే పని చేస్తారని ఆరోపించారు. తాను శనివారం మాజీ సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్నానని తెలిపారు. ఆమె వెంట నాయకులు గుంపుల లక్ష్మి, తిరుపతిరెడ్డి, సంపత్, సూరిబాబు, సదానందం, వేణు, శ్రీనివాస్ తదితరులున్నారు.

తలసేమియాపై అవగాహన ఉండాలి



వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న హరిశ్చంద్రారెడ్డి

మంచిర్యాలటౌన్: తలసేమియా, సికిల్‌సెల్‌ను నివారించేందుకు ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని, పెళ్లికి ముందు హెచ్‌బీఏ 2 రక్త పరీక్షలు చేసుకుని పూర్తిగా నివారించవచ్చని మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్‌చంద్రారెడ్డి సూచించారు. మే 8వ తేదీన ప్రపంచ తలసేమియా దినోత్సవాన్ని పురస్కరించుకుని వారంపాటు వ్యాధిపై అవగాహన సదస్సుల నిర్వహణలో భాగంగా శుక్రవారం మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్)లో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జీజీహెచ్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ.. ఇద్దరు వ్యాధితో ఉన్న వారు పెళ్లి చేసుకోవద్దని, ఒక్కరు వ్యాధితో ఉండి, మరొకరు వ్యాధి లేనివారు పెళ్లి చేసుకుంటే పుట్టబోయే సంతానం 50 శాతం మంచి పిల్లలు, మరో 50 శాతం వ్యాధితో జన్మిస్తారని తెలిపారు. వ్యాధిగ్రస్తులకు ప్రతీ 15 రోజులకోసారి జీవితాంతం రక్తం ఎక్కించాలని పేర్కొన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కే భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. తలసేమియా వ్యాధిగ్రస్తులు హిమోగ్లోబిన్ 9.5 గ్రాములు ఉండేలా చూసుకోవాలని తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకం కింద రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచితంగా మందులు అందిస్తున్నామని పేర్కొన్నారు. బోన్ మ్యారో మార్పిడి ద్వారా మాత్రమే వ్యాధి పూర్తిగా నయమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఫాతిమా జూలియట్, వైస్ ప్రిన్సిపాల్ సుజాత, లెక్చరర్ పద్మ, రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ చందూరి మహేందర్, కోశాధికారి కే సత్యపాల్‌రెడ్డి, కాసర్ల శ్రీనివాస్, మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు చుంచు శంకరయ్య పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

- ఏసీపీ రవికుమార్
- బెల్లంపల్లిలో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్



మాట్లాడుతున్న ఏసీపీ రవికుమార్

బెల్లంపల్లి: పార్లమెంటు ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ స్వేచ్ఛాయుతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని బెల్లంపల్లి ఏసీపీ ఏ.రవికుమార్ అన్నారు. శుక్రవారం బెల్లంపల్లిలో పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. సింగరేణి తిలక్‌స్టేడియం నుంచి ప్రారంభమైన ఫ్లాగ్‌మార్చ్ పాత బస్టాండ్, బజారు ఏరియా, కాంటా చౌరస్తా, బూడిదగడ్డ బస్తీ క్రాస్ రోడ్ మీదుగా ఏఎంసీ క్రీడా మైదానం వరకు సాగింది. కేంద్ర పారా మిలటరీ బలగాలు, పోలీసు సిబ్బంది కవాతు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి పోలీసులకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని అన్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు పోలీసుల సూచనలు, సలహాలు ఓటర్లు విధిగా పాటించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ రాకేష్‌మిశ్రా, బెల్లంపల్లి రూరల్‌సీఐ అఫ్జలుద్దీన్, బెల్లంపల్లి వన్‌టౌన్, టూటౌన్, తాళ్లగురిజాల ఎస్సైలు రమేష్, డి.రమేష్, జీ.నరేష్, బీఎస్‌ఎఫ్ సాయుధ పోలీసు బలగాలు, బెల్లంపల్లి సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.